క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



ఊట్కూరు: ఊట్కూరు, బిజ్వార్, పులిమామిడి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో రికార్డులు, మౌళిక వసతులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్పందన, సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి



మరికల్: పార్లమెంట్ శీతకాల సమావేశంలో ఎస్సీవర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు మాదిగ సామజిక వర్గాన్ని ఏబీసీడీ వర్గీకరణ చేపట్టి 12శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18, 19 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రామస్వామి, బాలకృష్ణ, నర్సింహులు, గోపాల్, కమల్, మాసప్ప, రాములు, బీమన్న, కృష్ణ పాల్గొన్నారు.

నిరంతరం ప్రజా సేవలో లయన్స్‌క్లబ్



కృష్ణా: లయన్స్‌క్లబ్ నిరంతరం ప్రజల కోసం పనిచేయడంతోపాటు ప్రజాసేవలో ఉంటుందని లయన్స్‌క్లబ్ గవర్నర్ నటరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రామ సర్పంచ్ రాధ మహాదేవ్‌తో కలిసి బ్లాంకెట్స్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ క్లబ్‌సేవలు ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ఉండే ఉంటాయన్నారు. చలికాలం కావడంతో మండల కేంద్రంలోని కొందరికి ఈ బ్లాంకెట్స్ ఉపయోగపడుతాయన్నారు. మక్తల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబాదాస్, స్థానిక నాయకులు శివరాజ్‌పాటీల్, మఠాధిపతులు గుర్తుమూర్తి మహాస్వామి, శంభులింగ మహాస్వామి పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం



మక్తల్: హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఆత్మీయసమ్మేళనంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను రాష్ట్ర టీపీసీసీ కల్లుగీత కార్మిక సంఘం చైర్మన్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు బంగ్లాలక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులుగౌడ్ శుక్రవారం సన్మానించారు.

నేటి నుంచి పిల్లలమర్రిలో ఉర్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రి హజ్రత్ సయ్యద్‌షా కమాల్ హుస్సేనీ చిస్తీ, సయ్యద్ షా జమాల్ హుస్సేనీ చిస్తీ రహెమతుల్లా అలై దర్గా 648వ ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ముతవల్లి షా మహ్మద్ ఫజల్‌ఖాన్ తెలిపారు. ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 17న గంధోత్సవం ఊరేగింపు ఉంటుందన్నారు. 18న ఉత్సవాల ముగింపు ఉంటుందన్నారు.



పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

- చైర్మన్‌కు వ్యతిరేకంగా 12మంది సభ్యుల తీర్మానం
- జిల్లా కో –ఆపరేటీవ్ అధికారి ఎదుట డైరెక్టర్ల హాజరు
- డైరెక్టర్లకు నోటీసులు అందజేత
- ఈ నెల 28న డైరెక్టర్ల సమావేశం



మద్దూరులో సహకార సంఘం కార్యాలయం



అవిశ్వాసంపై లేఖ ఇస్తున్న డైరెక్టర్లు (ఫైల్)

మద్దూరు: అసెంబ్లీ ఎన్నికల జరిగిన తర్వాత మండలంలో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోతున్నాయి. మండలంలోని దమ్‌గాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి పదవిచ్యుతుడిని చేయడానికి కాంగ్రెస్ నాయకులు వేగంగా పావులు కదుపుతున్నారు. ఈ నెల 12న జిల్లా కో–ఆపరేటీవ్ అధికారి కోదండరాంకు 12 మంది డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని కోరారు. డైరెక్టర్లు అందరు నా సమక్షంలో సంతకాలు చేయాలని డైరెక్టర్లకు డీసీఓ సూచించడంతో ఈ నెల 14న సహకారం సంఘం 12 మంది డైరెక్టర్లు డీసీఓ ఎదుట అవిశ్వాసంపై సంతకాలు చేశారు. దీంతో డీసీఓ కోదండరాం సహకార సంఘం డైరెక్టర్లకు ఈ నెల 28న చైర్మన్‌పై అవిశ్వాసం ఉంటుందని నోటీసులను అందజేసినట్లు సమచారం. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్‌ను దించి కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తిని చైర్మన్ చేయాలని కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

గతంలో రహస్య ఓటింగ్ ద్వారా చైర్మన్ ఎన్నిక

ఈ సహకార సంఘం ఎన్నికలు 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో 13 డైరెక్టర్లు ఉన్న ఈ సహకార సంఘంలో 7మంది బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులు, 6మంది కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. మరుసటి రోజు చైర్మన్ ఎన్నికల నిర్వహించగా బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థి బి. జగదీశ్వర్ చైర్మన్‌గా ఎన్నికైయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బలమైన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోకి చేరారు. దీంతో ఈ సహకార సంఘం డైరెక్టర్లు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం చైర్మన్ తప్ప డైరెక్టర్లు అందరూ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. దీంతో చైర్మన్ పదవి కూడా కాంగ్రెస్ పార్టీకి ఉండాలని ఈ అవిశ్వాసం పెట్టినట్లు తెలుస్తోంది.

పీఏసీఎస్ చైర్మన్‌గా నర్సింహా ?

గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున పీఏసీఎస్ చైర్మన్‌గా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూళ్ల నర్సింహా పోటీ చేశాడు. సంఖ్య బలం లేకపోవడంతో ఓటమి పాలైయ్యాడు. డైరెక్టర్లు అందరూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెల్పుతుడడంతో నర్సింహా ఎన్నిక లాంఛనప్రాయమే.

నోటీసులు అందజేశాం

దమ్‌గాన్‌పూర్ సహకార సంఘం చైర్మన్‌పై మెజార్టీ సభ్యుల కోరిక మేరకు అవిశ్వాసం కోసం డైరెక్టర్లకు నోటీసులు జారీ చేశాం. ఈ నెల 28న సహకార సంఘ కార్యాలయంలో హాజరుకావాల్సి ఉంటుంది. ఆ రోజు సభ్యుల తీర్మా నం మేరకు తదు పరి కార్యచరణ ఉంటుంది.

– కోదండరాం, జిల్లా కో- ఆపరేటీవ్ అధికారి, నారాయణపేట

ఉపాధి పనులపై ప్రజా వేదిక



వివరాలను నమోదు చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ గోపాల్‌నాయక్

మద్దూరు: ఏడాది కాలంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన, డీఆర్‌డీఓ పీడీ గోపాల్‌నాయక్ నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ 1నుంచి ఈ ఏడాది 31మార్చి వరకు ఉమ్మడి మండలంలో జరిగిన పనులపై ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి పనులపై చెరువులలో మట్టిపూడిక తీత పొలాల్లో మట్టి వేయ డం, పశువులషెడ్లు, క్రీడాప్రాంగణాలు, హరితహారం, పండ్లతోటల పెంపకం తదితర పనులు ఈ ఏడాది కాలంలో రూ.6కోట్ల, 71లక్షల 59వేల 484 రూపాయల పని జరిగింది. ఇందులో కూలీలకు 5కోట్ల 93 లక్షల52వేల, 604, సామగ్రికి రూ.78లక్షల, 6వేల, 880 రూపాయలు అందజేశారు. వీటికి సంబంధించిన పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు సేకరణపై ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో ఉపాధి సిబ్బంది అయిన టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శుల నుంచి 49 పంచాయతీల్లో రూ.57వేల,441 రూపాయలను వెంటనే రికవరీ చేయాలని, మరో 6లక్షల 29వేల 495 రూపాయాల పనుల సంబంధించి షోకాజ్ నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు సుధాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, అంబుజీమడ్ నాగిరెడ్డి, విజిలెన్స్ అధికారి రామకృష్ణారెడ్డి, ఉపాధి అధికారులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులతో మాట్లాడుతున్న పోలీసులు

నారాయణపేట రూరల్ : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాల్లో తనిఖీలు చేపట్టి నెంబర్‌ప్లేట్ లేని వాహనాలను గుర్తించి వాటికి నెంబర్ ప్లేట్ వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెంబర్‌ప్లేట్ లేకపోతే సదరు వాహనాలను క్రైమ్ చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు. నిబంధనల ప్రకారమే నెంబర్‌ప్లేట్ ఏర్పాటుచేయాలని, ఇష్టారీతిగా ఉండొద్దని సూచించారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్టును తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. అతివేగం ఎంతో ప్రమాదకరమని, నిర్ణత వేగంతోనే వాహనాలను నడపాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని అందుకు వాహన యజమానులు, పిల్లల తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదుచేస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి, మధు, దేవేందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



నారాయణపేటలో అయ్యప్ప స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న స్వాములు

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి, వైష్ణవిదేవి ఆలయంలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలాధారులతో బారంబావి శివాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా ఆలయం వరకు కలశం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఎక్లాస్‌పూర్ భక్తుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉమాపతి, అప్పి, కాకర్ల భీమయ్య, శివ, అశోక్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో వెంకప్ప గురుస్వామి ఇంట్లో శుక్రవారం అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, అష్టోత్తరం, పడిపూజ నిర్వహించారు. రాముగౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు భగవంతు, రఘువీర్, శంకర్, నర్సింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల్లోని అయ్యప్ప ఆలయంలో స్వామివారి పడిపూజ కార్యక్రమం సందర్భంగా పట్టణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అయ్యప్ప మాలధారణ స్వాములు మహాపడి పూజను మూడురోజులుగా వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మల్లికార్జునస్వామి బసవేశ్వర ఆలయం నుంచి అయ్యప్ప దేవాలయం వరకు స్వామివారి ఊరేగింపు కొనసాగించారు. మహామంగళ హారతీ, భక్తిపాటలతో పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ పూజలో అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



కోస్గిలో ..

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- ఆరుగురిపై కేసు నమోదు



కృష్ణా: మండలంలోని తంగిడిలో పేకాట స్థావరంపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు చేసింది. ఈ సందర్భంగా పేకాటరాయుళ్ల నుంచి రూ.16,380 నగదుతో పాటు 4 సెల్‌ఫోన్లు, 5 బైక్ లు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

22 నుంచి మోతకపల్లి బలభీమసేనా జాతర

దామరగిద్ద: మండల సరిహద్దులోని కర్నాటక రాష్ట్రం మోతకపల్లి బలభీమసేనా జాతర ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభిస్తున్నట్లు దేవస్థాన సమితి సభ్యులు తెలిపారు. శుక్రవారం నుంచి పల్లకి సేవాతో ఉత్సవాలు మొదలవుతాయన్నారు. 26 రాత్రి రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. జనవరి 1 సోమవారంతో ముగిస్తాయని తెలిపారు.

జోరుగా పేకాట..

మాగనూర్: మండల పరిధిలోని వాడ్వట్, కొత్తపల్లి, మాగనూర్ గ్రామాల్లో పేకాట జోరుగా సాగుతుందని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ప్రధానంగా ఇండ్లలో ఈ పేకాట ఆడుతున్నా రని అంటున్నారు. ముఖ్యంగా మైనార్ బాలురు, యువకులతోపాటు పెద్దవారు కూడా నిత్యం పేకాట ఆడుతూ.. బానిసలుగా మారుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇతర ప్రాంతల నుంచి ఇక్కడికి వచ్చి పేకాట లక్షలో ఆతున్నారని సమాచారం. ప్రధానంగా గ్రామంలోని కొన్నిఇండ్లలో ఈ పేకాట గుట్టుగా సాగుతుందని తెలుస్తుంది. పోలీసు అధికారులు ఆయా గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి పేకాటను నివారించాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి



వివిధరంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తున్నా మఠాధిపతులు

కృష్ణా: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకొని పేదలకు అన్నివిధాలా అండగా నిలవాలని నేరడగం పశ్చిమాద్రి విరక్తమఠం పీఠాధిపతి పంచమ సిద్ధలింగ మహాస్వామి అన్నారు. జెడ్పీటీసీ అంజనమ్మ కుమారుడు శివరాజ్ పాటీల్ జన్మదినం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని జ్ఞాన సంఘమ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్తాదాన శిబిరంతో పాటు ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన వారితో పాటు సమాజ సేవకులను శాలువా, పూలమాలతో సన్మానించారు. పీఠాధిపతి చెన్నవీర మహాస్వామి, కడెచూర్ పీఠాధిపతి గురుమూర్తి మహాస్వామి, గుర్మిటికల్ పీఠాధిపతి గురు మృగరాజేంద్ర మహా స్వామి, కల్లూర్ పీఠాధిపతి శంభులింగ మహాస్వామి, వేదమూర్తి క్షీరలింగ మహాస్వామి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ యాద్గీర్ జిల్లా కార్యదర్శి శరణ్‌గౌడ, ఎంపీపీ పూర్ణిమ వెంకట్‌రెడ్డి పాటీల్, సింగిల్విండో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజప్పగౌడ, మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

బీటీపై ఇసుక మట్టి

- వాహనాలు అదుపు తప్పితే ప్రమాదమే
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై మేటలు వేసిన ఇసుక మట్టి

దామరగిద్ద: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో కొండారెడ్డిపల్లి చెరువుకు సమీపంలోని అసైన్డ్ భూమి నుంచి ప్రభుత్వ అనుమతితో టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. కాగా నారాయణపేట నుంచి దామరగిద్ద వెళ్లేరహదారిలో మట్టి తరలించే టిప్పర్లు బీటీరోడ్డు పైకి చేరేచోట మట్టి పడటంతో బీటీరోడ్డుపై మట్టి, ఇసుక మేటలు వేసింది. అక్కడే ప్రధాన మలుపు ఉండటంతో ఎదరెదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో అదుపు తప్పి ప్రమా దాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి బీటీరోడ్డుపై మట్టిని తొలగించాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకోండి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

మరికల్: చదువుకునే విద్యార్థినులు సెల్‌ఫోన్ వినియోగించడం తగ్గించుకోవాలని షీ టీం ఏఎస్‌ఐ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని మణికంఠ జూనియర్ కళాశాలలో సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అందుకుగల కారణాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో అమ్మాయిలను ర్యాగింగ్, టీజింగ్, వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుపై శ్రద్ధతగ్గించి సెల్‌ఫోన్‌ను అధికంగా వాడటంతో చాలా అనార్థాలకు కారణమవుతుందన్నారు. అమ్మాయిలు సెల్‌ఫోన్ వినియోగించుకోవడం పూర్తిగా తగ్గించుకుని విద్యాపై శ్రద్ధ చూపితే భవిష్యత్‌లో మంచిగా స్థిరపడుతారన్నారు. ఎక్కడైన అమ్మాయిలు వేధింపులకు గురైతే వెంటనే 100కి డయల్ చేయాలని సూచించారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో జీవనోపాధికి విఘాతం ఏర్పడిందని పలువురు ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో శుక్రవారం ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.శ్రీనివాసులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడం వల్ల జీవనోపాధి కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల నుంచి ఆటోలు సరిగ్గా నడవకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారిందన్నారు. జిల్లాలో వేలాది ఆటో డ్రైవర్ల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని, ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని రద్దు చేసి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో రోడ్డుపైకి వచ్చి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆటోలతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్లు యాసిన్, రాజు,నాగేష్, వీరేష్, నర్సింలు, యాదయ్య, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



నర్వలో చిన్నారులకు యూనిఫామ్స్ ఇస్తున్న హెచ్‌ఎం, సీఆర్పీ



మాగనూర్‌లో..

నర్వ: బడిఈడు పిల్లలను తప్పకుండా పాఠశాలలో చేర్పించి విద్యనందించేందుకు కృషిచేయాలని సీఆర్పీ నర్సింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లంపల్లిగ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో హైదరాబాద్ వలస వెళ్లిన ఓ కుటుంబం ఇంటిలో అమ్మమ్మ వద్ద వదిలి వెళ్లిన చిన్నారులను గుర్తించామన్నారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి ఇద్దరు చిన్నారులు బోయ మహేష్, మోహన్‌లను స్థానిక ప్రాథమిక పాఠశాలలో 3వ, తరగతిలో చేర్పించామన్నారు. ఈ చిన్నారులకు హెచ్‌ఎం వెంకటన్న ఉచిత యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందించారు.

మాగనూర్: తల్లిదండ్రులు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య కోరారు. శుక్రవారం సర్వేలో భాగంగా మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి తిరిగి బడి బయట విద్యార్థులను గుర్తించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, సీఆర్పీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మందిపల్లిలో మురుగు కాల్వ నిర్మించాలి



ప్రధాన రహదారి వెంబడి పారుతున్న మురుగు

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లిలోని ప్రధాన రహదారిపై మురుగు కాల్వ లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రధాన రహదారి వెంబడి మురుగు పారుతుండటంతో ఇళ్లలోకి దుర్వాసన వస్తుందని ఇంటి ఆవరణలో కనీసం కూర్చోలేకపోతున్న పరిస్థితి నెలకొందని అంటున్నారు. మురుగు నీటితో అనారోగ్యం బారిన పడుతున్నారని సంబంధిత అధికారులు స్పందించి మురుగుకాల్వల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.